# సాక్షి
## భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం । 4 । డిసెంబర్ । 2024






**గిరిజనుల జీవన విధానం..**
గిరిజనుల జీవన విధానం వైవిధ్యభరితంగా ఉందని మహారాష్ట్రకు చెందిన శాస్త్రవేత్తల బృందం వెల్లడించింది. 8లో



**సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం**
సంక్షేమ, అభివృద్ధే ధ్యేయంగా ఇందిరమ్మ ప్రభుత్వ పాలన సాగుతోందని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. 8లో

**వాతావరణం**
గరిష్ఠం/కనిష్ఠం 31°/23°
జిల్లాలో బుధవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం పలుచోట్ల జల్లులు కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### అవినీతి వ్యతిరేక వాల్ పోస్టర్లు ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఈ నెల 9న అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం నుంచి వారంరోజులపాటు అవినీతి వ్యతిరేక వారోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో అవినీతి నిరోధక శాఖ రూపొందించిన వాల్‌పోస్టర్లను కలెక్టర్ జితేష్ వి.పాటిల్ మంగళవారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏసీబీ డీఎస్పీ వై.రమేష్, ఇన్‌స్పెక్టర్ ఎస్.శేఖర్ పాల్గొన్నారు.

### టీజీఎఫ్‌డీసీ భవనాలు ప్రారంభోత్సవానికి సిద్ధం

- నేడు వర్చువల్‌గా ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి



విద్యుత్‌కాంతులతో వెలుగులీనుతున్న టీజీఎఫ్‌డీసీ భవనం

చుంచుపల్లి: ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా కొత్తగూడెంలోని తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ భవన సముదాయాలను బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. పాత టీజీఎఫ్‌డీసీ భవనాల స్థానంలో కొత్తగూడెంలో ఇటీవల రూ.3.14 కోట్ల వ్యయంతో కొత్త భవన సముదాయాలు నిర్మించారు. భవనాలను నేడు ఉదయం 11 గంటలకు సీఎం ప్రారంభిస్తారని కొత్తగూడెం డివిజనల్ మేనేజర్ జి.చంద్రమోహన్ తెలిపారు.

### క్రీడల్లో నైపుణ్యం సాధించాలి

దుమ్ముగూడెం : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ నైపుణ్యం సాధించాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి బి.రాహుల్ సూచించారు. మంగళవారం మండలంలోని గౌరారం గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలను సందర్శించి, క్రీడా స్థలాన్ని పరిశీలించారు. మెనూ అమలుపై ఆరా తీశారు. అనంతరం పీఓ మాట్లాడుతూ రోజూ క్రీడాపోటీల్లో పాల్గొనాలని సూచించారు. 80 శాతం పాఠశాలలకు క్రీడా సామగ్రి అందించామన్నారు. అనంతరం క్రీడా పోటీల్లో పాల్గొని విద్యార్థినులను ఉత్సాహపరిచారు. స్పోర్ట్స్ కిట్ అందజేశారు. అధికారులు గోపాలరావు, నాగేశ్వరరావు, మోతిర్, లక్ష్మీపతి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

### స్కూల్ కాంప్లెక్స్ నిధులు విడుదల

- 90 కాంప్లెక్స్‌లకు రూ.29.7లక్షలు

పాల్వంచరూరల్: స్కూల్ కాంప్లెక్స్‌లకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు విడుదల చేసింది. ఈ మేరకు డీఈఓ వెంకటేశ్వరాచారి మంగళవారం వివరాలు వెల్లడించారు. జిల్లాలోని 1065 పాఠశాలలు 90 కాంప్లెక్స్‌లుగా ఉన్నాయి. 2024–2025 ఆర్థిక సంవత్సరానికి కాంప్లెక్స్‌కు రూ.33 వేల చొప్పున మొత్తం రూ.29,70,000లు మంజూరు చేసింది. గతేడాది ఒక్కో కాంప్లెక్స్‌కు రూ.28 వేల చొప్పున విడుదల చేయగా ఈసారి రూ.5 వేలు పెంచి రూ.33 వేల చొప్పున అందించింది. పాల్వంచ మండలంలో ఐదు కాంప్లెక్స్‌లు ఉండగా రూ.1,65,000 మంజూరయ్యాయి. నిధులు పెంచి విడుదల చేయడంపట్ల కాంప్లెక్స్ హెచ్‌ఎంలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బోధనా సామర్థ్యం పెంపు సమావేశాలకు ఉపాధ్యాయులు తయారు చేసే టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ కోసం, శిక్షణ సమయంలో ఖర్చుల నిమిత్తం ఈ నిధులను వినియోగించుకోనున్నారు.



డీఈఓ వెంకటేశ్వరాచారి

### కేటీపీఎస్‌లో విద్యుదుత్పత్తికి బ్రేక్

పాల్వంచరూరల్: సాంకేతిక లోపం కారణంగా కేటీపీఎస్‌లోని 9వ యూనిట్ ట్రిప్ కావడంతో విద్యుదుత్పత్తికి అంతరాయం కలిగింది. కర్మాగారంలోని 5వ దశలో 250 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన 9వ యూనిట్‌లో బాయిలర్ ట్యూబ్ లీకైంది. దీంతో సాంకేతిక లోపం తలెత్తి ఉత్పత్తి నిలిచిపోయింది. మరమ్మతులు చేపట్టామని బుధవారం ఉత్పత్తిని పునరుద్ధరిస్తామని చీఫ్ ఇంజనీర్ ప్రభాకర్ తెలిపారు.

# సరికొత్త పథంలో...

**బహుముఖ విస్తరణకు సింగరేణి ప్రణాళికలు**
- ఇప్పటికే బొగ్గుతోపాటు థర్మల్, సోలార్ విద్యుదుత్పత్తి
- కొత్తగా గ్రీన్ హైడ్రోజన్, మిథనాల్ తయారీపై దృష్టి
- కార్మిక సంక్షేమం, సామాజిక బాధ్యతలో మేటి



సింగరేణి ప్రధాన కార్యాలయం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: వందేళ్లపాటు సింగరేణి సంస్థ కేవలం బొగ్గు ఉత్పత్తికే ఎక్కువగా పరిమితమైంది. అక్కడక్కడా పిట్ మైన్స్ ఏర్పాటు చేసినా వాటి ఉత్పత్తి సామర్థ్యం తక్కువ. తెలంగాణ వచ్చిన తర్వాత కేవలం బొగ్గు ఉత్పత్తిపై ఆధారపడితే సంస్థకు మనుగడ కష్టమనే నిర్ణయానికి వచ్చింది. దీంతో ముందుగా థర్మల్ విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి సారించింది. మంచిర్యాల జిల్లా జైపూర్‌లో నిర్మించిన 1200 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ సంస్థకు కొంగుబంగారంగా మారింది. దీంతో మరింత దూకుడుగా విద్యుదుత్పత్తి దిశగా అడుగులు వేస్తోంది. మరోవైపు కాలుష్యాన్ని నియంత్రణలో భాగంగా మరో ఏడాదిలో 500 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేయనుంది. ఫలితంగా నెట్‌జీరో సంస్థగా గుర్తింపు పొందనుంది.

**లిథియం మైనింగ్‌పైనా దృష్టి..**
సంస్థను బహుముఖంగా విస్తరించడంలో భాగంగా రాబోయే రోజుల్లో సరికొత్త ప్రయోగాలకు సింగరేణి శ్రీకారం చుట్టనుంది. ఇల్లెందు, రామగుండంలలో 600 మెగావాట్ల సామర్థ్యంతో పంప్డ్ స్టోరేజీ హైడల్ ప్రాజెక్ట్ నిర్మించనుంది. ఈ మేరకు ప్రముఖ సంస్థ చేత ప్రణాళిక తయారు చేయిస్తోంది. మందమర్రి ఏరియాలో బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్ ఏర్పాటు చేస్తోంది. సింగరేణి థర్మల్ పవర్ స్టేషన్‌లో ఉప ఉత్పత్తిగా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిని మొదలు పెట్టింది. అక్కడే కార్బన్ డయాక్సైడ్ నుంచి మిథనాల్ తయారీకి సన్నాహాలు మొదలయ్యాయి. మణుగూరులో ఉన్న వేడి నీటి ఊటల ద్వారా జియో విద్యుదుత్పత్తికి ఓఎన్‌జీసీ సహకారంతో ప్రయత్నాలు చేస్తోంది. అందుబాటులోకి వచ్చిన టెక్నాలజీ ఉపయోగించుకుని బొగ్గు ద్వారా అమ్మోనియం నైట్రేట్ తయారీపైనా సింగరేణి ఫోకస్ చేసింది. లిథియం మైనింగ్‌పై ఫోకస్ చేస్తోంది. మరోవైపు సింగరేణి విస్తరించిన ఏరియాలో పెట్రోలు బంకులు, గోదావరిఖనిలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి సంస్థ రెడీ అవుతోంది. ఒకప్పుడు సింగరేణి అంటే బొగ్గు ఒక్కటే గుర్తుకు వచ్చేది. రాబోయే రోజుల్లో సరికొత్త ఇమేజ్‌ను సంస్థ సొంతం చేసుకోనుంది.

**నంబర్ వన్ ఇలాఖాలో..**
దేశవ్యాప్తంగా బొగ్గు ఉత్పత్తిలో తెలంగాణ ఐదో స్థానంలో ఉండగా ఒడిశా నంబర్ వన్‌గా ఉంది. ఒడిశాలో కాలు మోపేందుకు దశాబ్దకాలంగా సింగరేణి చేస్తున్న ప్రయత్నాలు ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కి అన్నట్టుగా ఉండేవి. కానీ గడిచిన ఏడాది కాలంగా ఈ పరిస్థితిలో మార్పు వచ్చింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీఎండీ ఎన్.బలరాంనాయక్‌లు ఒడిశా సర్కారుతో క్రమం తప్పకుండా చర్చలు జరపడంతో అనేక అడ్డంకులు తొలగిపోయాయి. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఇక్కడ బొగ్గు ఉత్పత్తి జరగనుంది. రాజస్థాన్‌లో సోలార్ పవర్ ప్లాంట్ల స్థాపనకూ సింగరేణి ఆసక్తి చూపుతోంది.

**సంక్షేమం, సామాజిక బాధ్యత**
రామగుండం, కొత్తగూడెం ఆస్పత్రుల్లో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి తెస్తున్నారు. హైదరాబాద్‌కు దూరంగా ఉన్న ప్రాంతాల్లో సూపర్ వైద్య సేవలు అందుబాటులోకి రావడం వల్ల కార్మికులతోపాటు చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. మారుతున్న పరిస్థితులకు తగ్గట్టుగా వచ్చే ఏడాది నుంచి రామగుండం 2, సెక్టార్ 3 స్కూల్ నుంచి సీబీఎస్‌ఈ సిలబస్ ప్రారంభించనుంది.

**సంస్థ చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను పరిశీలిస్తే..**
- ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని తొలిసారిగా బీసీ లైజన్ ఆఫీసర్ నియామకం చేపట్టింది
- వివిధ పనుల మీద హైదరాబాద్ వెళ్లే సింగరేణి ఉద్యోగుల కోసం తొలిసారిగా రాష్ట్ర రాజధానిలో గెస్ట్‌హౌస్ నిర్మాణం
- కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5 వేల వంతున బోనస్ చెల్లింపుతో పాటు రూ. 30 లక్షల ప్రమాద బీమా వర్తింపు
- ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల్లో స్థానికులకు 80 శాతం రిజర్వేషన్ సౌకర్యం
- కారుణ్య నియామకాల్లో గరిష్ఠ వయస్సు పరిమితిని 35 నుంచి 40 ఏళ్లకు పెంపు
- ఏరియాల వారీగా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల ఏర్పాటు
- రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం ద్వారా ప్రతీ ఏడు 140 మందికి రూ.లక్ష వంతున ఆర్థిక సాయం

**ఆదర్శంగా సింగరేణి**



తెలంగాణ వచ్చిన తర్వాత సింగరేణి బహుముఖంగా విస్తరించడం ప్రారంభించింది. ఏడాది కాలంగా ఈ విస్తరణలో వేగం మరింతగా పెరిగింది. దీనికి తోడు సామాజిక బాధ్యత విషయంలో ఇతర సంస్థలకు ఆదర్శంగా నిలిచేలా మా సంస్థ అడుగులు పడుతున్నాయి.
– ఎన్.బలరాంనాయక్, సింగరేణి సీఎండీ

## సమగ్ర విద్యపై ప్రభుత్వానికి నివేదిక

**రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి**

మణుగూరు టౌన్/అశ్వాపురం: విద్యార్థులకు అందుతున్న విద్యలో లోపాలపై, తెలుగు, ఆంగ్ల విద్యను అందరికీ అందించాల్సిన ఆవశ్యకత, సమగ్ర విద్యా విధానంపై ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి తెలిపారు. ఇటీవల రాష్ట్రంలోని హాస్టళ్లు, పాఠశాలల్లో ఫుడ్ పాయిజనింగ్ జరిగి విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్న విషయాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఆయన మణుగూరు జెడ్పీ హైస్కూల్, అశ్వాపురం మండలం గొందిగూడెం ఆశ్రమ పాఠశాలను, గిరిజన ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులకు వండిన ఆహార పదార్థాలను పరిశీలించారు. తరగతి గదులు, వంట శాల, వంట సామగ్రిని తనిఖీ చేశారు. విద్యార్థుల సంఖ్యను బట్టి తరగతి గదులు, తగిన వసతులు ఉన్నాయో లేదో తెలుసుకున్నారు. ఆంగ్లం బోధన, సిలబస్‌లో తీసుకోవాల్సిన గుణాత్మక మార్పులు, సైన్స్ ల్యాబ్స్, ఆట స్థలాలు, హాజరు శాతం మెరుగుకు తీసుకోవాల్సిన చర్యలపై ఉపాధ్యాయుల అభిప్రాయాలను సేకరించారు. విద్యార్థులతో మాట్లాడి ఆంగ్లం అంటే భయం కలగడానికి కారణాలు తెలుసుకున్నారు. వారి సామర్థ్యాలను పరిశీలించారు. గొందిగూడెం ఆశ్రమ పాఠశాలలో హాస్టల్ విద్యార్థులకు, పాఠశాల విద్యార్థులకు మెనూ వేర్వేరుగా అమలు చేస్తుండగా, అందరికీ ఒకేలా భోజన మెనూ ఉండేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు పెంచి కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలను పరిశీలించేందుకు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నామన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. ఈ కార్యక్రమాల్లో ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, ఏటీడబ్ల్యూఓ అశోక్, ఎంఈఓ స్వర్ణజ్యోతి, హెచ్‌ఎం నాగశ్రీ తదితరులు పాల్గొన్నారు.



మణుగూరుటౌన్: ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న విద్యా కమిషన్ చైర్మన్ మురళి



అశ్వాపురం: గొందిగూడెం పాఠశాలలో విద్యార్థి సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న చైర్మన్

## ‘ముంపు’లో కేంద్ర బృందం పరిశీలన



బూర్గంపాడు: ఉర్లదోసపాడులో జరిగిన పశు నష్టంపై బాధిత రైతులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం ప్రతినిధులు



అదనపు కలెక్టర్‌తో సమావేశమైన బృంద సభ్యులు

- గత సెప్టెంబర్‌లో వరద ముంపునకు గురైన ప్రాంతాల్లో పర్యటన
- బాధితులకు అందిన పరిహారం, చేపట్టబోయే పనులపై ఆరా

బూర్గంపాడు/మణుగూరుటౌన్: సెప్టెంబర్ నెలలో కురిసిన అతి భారీ వర్షాలకు జరిగిన పంటనష్టం, పశు నష్టంపై కేంద్ర ప్రకృతి వైపరీత్యాల అధ్యయన బృందం మంగళవారం పరిశీలన చేపట్టింది. బూర్గంపాడు మండలంలోని కృష్ణసాగర్ గ్రామపంచాయతీ ఉర్లదోసపాడులో భారీవర్షాలకు వాగు పొంగి 45 పశువులు మృత్యువాత పడ్డాయి. వేలాది ఎకరాలలో పంటలకు నష్టం వాటిల్లింది. బాధితులకు ప్రభుత్వ పరంగా ఎలాంటి సాయం అందించారు? నష్టపరిహారం ఏ మేరకు అందించారు? తదితర విషయాలను తెలుసుకునేందుకు కేంద్ర బృందం క్షేత్రస్థాయిలో పర్యటించింది. మణుగూరులో వరద ముంపు ప్రభావానికి గురైన ప్రాంతాల్లో కూడా పర్యటించింది. పట్టణానికి వచ్చిన వరద నిధులతో చేపట్టిన పనుల వివరాలు పంచాయతీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కట్టువాగు పూడికతీత పనులను పరిశీలించారు. పట్టణంలో వరద నిధులతో చేపట్టబోయే పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యులతోపాటు వ్యవసాయ అధికారులు, మణుగూరు తహసీల్దార్ రాఘవరెడ్డి, మున్సిపల్ ఏఈ సత్యనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**వరద నష్టం, సహాయక చర్యలను వివరించిన అదనపు కలెక్టర్**
సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో మంగళవారం డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కేంద్ర, రాష్ట్ర బృంద సభ్యులు పర్యటించారు. పర్యటనకు ముందు కలెక్టరేట్‌లో కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వర్షాలు, వరదల వల్ల జిల్లాలో సంభవించిన నష్టాలను, అధికారులు చేపట్టిన సహాయక చర్యలను బృందం సభ్యులకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. భారీ వర్షాలతో ఏడు ముంపు ప్రభావిత మండలాల్లో పంటనష్టంతోపాటు దెబ్బతిన్న రోడ్లు, విద్యుత్ వ్యవస్థ గురించి విశదీకరించారు. గోదావరి వరదల సమయంలో భద్రాచలం తదితర ప్రాంతాల్లో చేపట్టిన సహాయక చర్యలను, జరిగిన నష్టం వివరాలను తెలిపారు. అనంతరం బృంద సభ్యులు వరదముంపునకు గురైన మణుగూరు, అశ్వాపురం, బూర్గంపాడు మండలాల్లోని పలు ప్రాంతాలను పరిశీలించారు. జిల్లాకు వచ్చిన డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అధికారుల బృందంలో ప్రవీణ్, శ్రీనివాసచారి, ఐశ్వర్య, రవిపాల్, అధికలాం, సాయిబాబా, ప్రదీప్ కుమార్, వరుణ్, మోతీలాల్, శ్రీనివాస్ ఉన్నారు.

## క్యాలెండర్లు ఆవిష్కరించిన మంత్రి తుమ్మల



భద్రాచలం రామాలయ క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న మంత్రి తుమ్మల, ఈఓ తదితరులు

దమ్మపేట: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ నూతన సంవత్సర క్యాలెండర్లను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం ఆవిష్కరించారు. మండలంలోని గండుగులపల్లి నివాసంలో మంత్రి తుమ్మలను భద్రాచలం రామాలయం ఈఓ రమాదేవి, వేద పండితులు మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను శాలువాతో సత్కరించారు.

**అధికారులతో సమావేశం**
మండలంలోని గండుగులపల్లిలో ఉన్న తన నివాసంలో సీతారామ ప్రాజెక్ట్ అధికారులు, ఫారెస్టు, రెవెన్యూ అధికారులతో మంత్రి తుమ్మల సమావేశం నిర్వహించి, పలు ఆదేశాలు జారీ చేశారు. సీతారామ ప్రాజెక్టు పనుల్లో అలసత్వం చూపకుండా త్వరితగతిన పూర్తి చేయాలని, 2025 ఆగస్టు 15 నాటికి ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులకు సాగు నీరు అందించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ సంబంధిత పనులకు అవసరమైన మట్టి తోలకాల్లో ఫారెస్టు అధికారులు అతిగా జోక్యం చేసుకుని, పనులకు విఘాతం కలిగించవద్దని హితవు పలికారు. మండలపల్లి రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం కాకుండా చూడాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

## దివ్యాంగ పిల్లలు రాణించాలి

కొత్తగూడెంఅర్బన్: సాధారణ పిల్లలతోపాటు సమానంగా దివ్యాంగ పిల్లలు రాణించాలని అడిషనల్ కలెక్టర్ విద్యాచందన సూచించారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ సందర్భంగా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో కొత్తగూడెం మండలంలోని భవిత కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో ఆమె మాట్లాడారు. జిల్లా విద్యాశాఖ సమ్మిళిత విద్య కోఆర్డినేటర్ ఎస్‌కే సైదులు మాట్లాడుతూ దివ్యాంగ పిల్లలకు సమ్మిళిత విద్యనందిస్తున్నామని, అవసరమైన ఉపకరణాలను ఆలింకో సంస్థ ద్వారా అందజేస్తున్నట్లు తెలి పారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ ట్రై సైకిల్స్, సీపీ చైర్, వినికిడి యంత్రం, రోలేటర్ వంటి పరికరాలను దివ్యాంగ పిల్లలకు అందజేశారు. ఆటలు, క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సమ్మిళిత విద్య రిసోర్స్ పర్సన్లు శ్రీరామ్, అరుణ కుమారి పాల్గొన్నారు.

# చెప్పిన ప్రతీ పని చేస్తాం..

- సీతారామ ప్రాజెక్టు పూర్తితో భద్రాద్రి జిల్లాలో కొత్త ఆయకట్టు
- గోదావరి జలాలతో సాగర్ ఆయకట్టును స్థిరీకరిస్తాం
- వచ్చే నాలుగేళ్లలో అన్నిరంగాల్లో అగ్రభాగాన ఉమ్మడి జిల్లా
- పాలేరు నియోజకవర్గాన్ని అభివృద్ధికి చిరునామాగా మారుస్తా

**ఏడాది పాలనపై రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**





**పాలేరుకు కొత్తరూపు..**
ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో నన్ను గెలిపించిన పాలేరు ప్రజల రుణం తీర్చుకుంటా. ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద 2023–24, 2024–25 ఆర్థిక సంవత్సరాలకు రూ.57.15 కోట్లు మంజూరయ్యాయి. రూ.5 కోట్లతో పాలేరు లేక్ నిర్మాణం చేపట్టాం. రూ.12 కోట్లతో ఎన్నెస్పీ కాల్వకు మరమ్మతులు చేయించాం. సీఆర్‌ఆర్ గ్రాంట్ కింద 11 అభివృద్ధి పనులకు రూ.25 కోట్లు మంజూరు చేశాం. కూసుమంచిలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయించి నిర్వహణకు రూ.5.5 కోట్లు కేటాయించాం. అలాగే ట్రామా కేర్ సెంటర్‌కు రూ.26 కోట్లు మంజూరయ్యాయి.

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ‘ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతీ హామీని అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్నాం. రైతును రాజుగా చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి దృఢసంకల్పంతో ఉన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు పాలేరు నియోజకవర్గంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నాం. రైతులకు రుణమాఫీ చేయగా, సంక్రాంతి తర్వాత రైతుభరోసా అందనుంది. త్వరలోనే ఏదులాపురం కేంద్రంగా కొత్త మున్సిపాలిటీ ఏర్పాటవుతుంది’ అని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఈనెల 7వ తేదీతో ఏడాది పూర్తవుతున్న సందర్భంగా మంగళవారం ఆయన ‘సాక్షి’కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇప్పటి వరకు అమలుచేసిన హామీలతో పాటు భవిష్యత్ ప్రణాళికలను వివరించారు. ఆ వివరాలు మంత్రి మాటల్లోనే..

**తగ్గేదే లేదు..**
హామీల అమలులో ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా వెనుకడుగు వేయలేదు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్, రూ.500కు సబ్సిడీ గ్యాస్ అందిస్తున్నాం. అలాగే రేషన్ లబ్ధిదారులతోపాటు హాస్టళ్లు, పాఠశాలల్లో సన్న బియ్యం ఇచ్చేలా సన్నాహాలు చేస్తున్నాం. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలను పూర్తి చేస్తాం. జాతీయ రహదారులతోపాటు ఆర్‌అండ్‌బీ రహదారులు కొత్తవి నిర్మించడంతోపాటు అవసరమైన చోట్ల మరమ్మతులు జరుగుతున్నాయి. పర్యాటక రంగ అభివృద్ధిలో భాగంగా నేలకొండపల్లిలో బౌద్ధస్తూపం అభివృద్ధికి రూ.2.50 కోట్లను ప్రభుత్వం కేటాయించింది.

**సీతారామ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి..**
ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేసే సీతారామ ప్రాజెక్టు పనులు త్వరగా పూర్తి చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. భవిష్యత్‌లో సాగర్ జలాలు రాకున్నా గోదావరి జలాలతో ఈ ప్రాజెక్టు నింపొచ్చు. 2.50 లక్షల ఎకరాలకు పైగా సాగర్ ఆయకట్టులో కృష్ణా, గోదావరి జలాలతో రెండు పంటలు పండుతాయి. పాలేరు లింక్ కెనాల్ పనులు కూడా త్వరగానే పూర్తవుతాయి. ఈ ప్రాజెక్టుతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నూతనంగా ఆయకట్టు ఏర్పడుతుంది. ఇటు సాగర్, ఆటు సీతారామతో ఉమ్మడి జిల్లా పంటల హబ్‌గా మారనుంది.

**ఇది మా రికార్డు..**
కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులే బలం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రైతు రుణమాఫీ అమలు చేశాం. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నాలుగు విడతలుగా 1,97,384 మంది రైతులకు రూ.1,392 కోట్ల మేర రుణాలు మాఫీ అయ్యాయి. దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా రుణమాఫీ రూ.2 లక్షల వరకు చేయలేదు. ఇది మా ప్రభుత్వ రికార్డు. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ధాన్యానికి రూ.250 బోనస్ ఇవ్వగా, ఇప్పుడు రూ.500 ఇస్తున్నాం. ఎన్నికల హామీ మేరకు సంక్రాంతి తర్వాత రైతు భరోసా అమలుచేస్తాం.

**మున్నేటి కన్నీరు తీరుస్తాం...**
ఈ ఏడాది సెప్టెంబర్‌లో మున్నేటికి మునుపెన్నడూ లేని రీతిలో వరద వస్తే ప్రజలను రక్షించేందుకు అన్ని చర్యలు చేపట్టాం. నష్టపోయిన ప్రతీ కుటుంబానికి రూ.16,500 చొప్పున అందించాం. పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాం. సర్టిఫికెట్లు నష్టపోయిన వారికి కొత్తవి జారీ చేయిస్తున్నాం. భవిష్యత్‌లో మున్నేటి పరీవాహక ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండేందుకు రక్షణగోడ నిర్మాణం జరుగుతోంది.

**వేగంగా అభివృద్ధి**
పాలేరు నియోజకవర్గంలో ఎస్సారెస్పీ కాల్వల కోసం భూములు ఇచ్చిన కూసుమంచి మండల రైతులకు రూ.1.70 కోట్లు పరిహారం చెల్లించాం. తద్వారా 5వేల ఎకరాలకు నీరు అందించాం. నియోజకవర్గంలో తల్లంపాడు–రాజేశ్వరపురం, పల్లెగూడెం–మంగళగూడెం, పొన్నెకల్ క్రాస్ రోడ్డు నుంచి పిట్టలవారిగూడెం వరకు ఆర్‌అండ్‌బీ రహదారి పనులకు శంకుస్థాపన చేశాం. పొన్నెకల్‌లో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం జరగనుంది. నేలకొండపల్లిలో రూ.10 కోట్లతో మోడల్ డిగ్రీ కళాశాలను ప్రారంభించాం. నేలకొండపల్లిలో గ్రంథాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశాం. రూ.3కోట్లతో బీరోలు చెరువు సుందరీకరణ చేపట్టాం. తిరుమలాయపాలెంలో ఎంసీహెచ్ ఏర్పాటుకు రూ.26కోట్లతో ప్రతిపాదనలు పంపాం. ఈ మండలంలో రూ.5 కోట్లతో గిరిజన బాలుర వసతి గృహాన్ని నిర్మిస్తున్నాం. వచ్చే నాలుగేళ్లలో ఉమ్మడి జిల్లాతో పాటు పాలేరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే మోడల్‌గా తీర్చిదిద్దుతా. ప్రతీ నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తాం.

**ఇంకా చేయాల్సినవి**
- పాలేరు రిజర్వాయర్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం
- గ్రామాల నుంచి మండల కేంద్రానికి రహదారులను డబుల్ లేన్‌గా మారుస్తాం
- ప్రతీ గ్రామపంచాయతీకి నూతన భవనాలను నిర్మిస్తాం
- పాలేరు నియోజకవర్గంలో పీహెచ్‌సీల స్థాయి పెంచి వసతులు కల్పిస్తాం
- చివరి ఆయకట్టుకు నీరు అందేలా పంట కాల్వల్లో సిల్ట్ తీయిస్తాం

## క్లుప్తంగా

### రజాలీపాషాకు రాష్ట్రస్థాయి అవార్డు



రజాలీపాషాకు అవార్డు అందిస్తున్న మంత్రి సీతక్క

**ఇల్లెందురూరల్:** మండలంలోని సుభాష్‌నగర్‌కు చెందిన దివ్యాంగుడైన ఉపాధ్యాయుడు రజాలీ పాషాను రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు వరించింది. దివ్యాంగుల కోసం హెల్మెట్ తయారు చేసిన ఆయన ప్రతిభకు మెచ్చిన ప్రభుత్వం అవార్డుకు ఎంపిక చేసింది. దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి సీతక్క, దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ వీరయ్య, సంక్షేమ విభాగం డైరెక్టర్ శైలజ తదితరులు పాషాకు అవార్డు అందజేసి సన్మానించారు.

### రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ టోర్నీలో ప్రతిభ



బిట్రా కార్తీక

**బూర్గంపాడు:** సారపాకలోని ఐటీసీ అనుబంధ భద్రాచలం పబ్లిక్‌స్కూల్‌లో 4వ తరగతి చదువుతున్న బిట్రా కార్తీక రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో రెండో స్థానంలో నిలిచింది. మంచిర్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ సబ్ జూనియర్ పోటీల్లో జావలిన్‌త్రోలో రెండో స్థానం సాధించి, వెండి పతకం, ప్రశంసా పత్రం అందుకుంది. మంగళవారం విద్యార్థినిని ఐటీసీ పీఎస్‌పీడీలోని బీఆర్‌టీయూ యూనియన్ అధ్యక్షులు సానికొమ్ము శంకర్‌రెడ్డి, కె.ప్రవీణ్, సతీశ్, పోటు నర్సింహారావు, కె.రాజశేఖర్‌రెడ్డి, వెంకటనారాయణ, సత్యనారాయణ, దయాకర్, నరేశ్, సాయిబాబ తదితరులు అభినందించారు.

### గోదావరి తీర ప్రాంతాల్లో తనిఖీలు



గోదావరి తీర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఐ వెంకటేశ్వరరావు

**పినపాక:** డిసెంబర్ 2 నుంచి 8 వరకు మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో ఈ–బయ్యారం సర్కిల్ పరిధిలోని గోదావరి పరీవాహక ప్రాంతాల వెంట సీఐ వెంకటేశ్వరరావు మంగళవారం ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. చింతల బయ్యారం, భూపతిరావుపేట రేవు ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించి జాలర్లతో మాట్లాడారు. గుర్తుతెలియని వ్యక్తులు గోదావరి దాటుతున్నా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారు ఎదురుపడినా వెంటనే తమకు సమాచారం అందించాలన్నారు. ఇటీవల ఛత్తీస్‌గఢ్ పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న వరుస ఎన్‌కౌంటర్లతో మావోయిస్టులు స్థావరాల కోసం గోదావరి మార్గాన్ని ఎన్నుకునేందుకు వీలుందనే అనుమానంతో ముమ్మర తనిఖీలు చేపడుతున్నామని చెప్పారు.

### మావోయిస్టులు చెట్లు నరికారనేది అవాస్తవం..

**చర్ల:** పూసుగుప్ప రహదారిలో గాలిదుమారం వల్ల చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయని, మావోయిస్టులు చెట్లు నరికి రోడ్డుకు అడ్డంగా వేశారనేది అవాస్తవని చర్ల సీఐ రాజువర్మ తెలిపారు. సోమవారం సాయంత్రం పూసుగుప్ప, వద్దిపేట, ఉంజుపల్లి గ్రామాల సమీపాల్లోని అటవీ ప్రాంతంలో గాలిదుమారంతో పాటు వర్షం కురిసిందని ఈ సందర్భంలో రహదారిపై అక్కడక్కడా చెట్ల కొమ్మలు విరిగి పడటంతో ఆ మార్గంలో రాత్రి పూట రాకపోకలు నిలిచిపోయాయన్నారు. మావోయిస్టు పీఎల్‌జీఏ వారోత్సవాలు కొనసాగుతున్న నేపథ్యంలో చెట్ల కొమ్మలు విరిగి రోడ్డుపై పడగా, అది మావోయిస్టుల పనే అయి ఉండవచ్చునని భావించి.. అక్కడికి వెళ్లి పరిశీలిస్తే అది మావోయిస్టుల పని కాదని తేలిందని చెప్పారు.

### డిగ్రీ పరీక్షల్లో 42 మంది డీబార్

**కేయూక్యాంపస్/ఖమ్మంసహకారనగర్:** కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ తదితర కోర్సుల మొదటి, ఐదో సెమిస్టర్ పరీక్షలు మంగళవారం జరిగాయి. కాగా, వివిధ కేంద్రాల్లో కాపీ చేస్తూ పట్టుబడిన 42 మంది విద్యార్థులను స్క్వాడ్ బృందాలు డీబార్ చేశాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆరుగురు, వరంగల్ జిల్లాలో ఒకరు, ఆదిలాబాద్‌లో 35 మంది డీబార్ అయ్యారని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఎస్.నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ తిరుమలాదేవి తెలిపారు.

### చెరువులో పడి వ్యక్తి గల్లంతు?

**ఇల్లెందురూరల్:** మండలంలోని సుదిమళ్ల పెద్దచెరువు కట్టపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తి ప్రమాదవశాత్తు జారి చెరువులో పడిపోయాడు. ఈ దృశ్యాన్ని తాను చూశానని సమీపంలో పశువులు కాస్తున్న వ్యక్తి వెంటనే గ్రామస్తులకు సమాచారం అందించాడు. కొంత మంది చెరువు వద్దకు వెళ్లి వ్యక్తి ఆచూకీ కోసం వెతికారు. సుమారు గంట పాటు ప్రయత్నించినా చెరువులో ఎవరూ కనిపించకపోవడంతో అక్కడి నుంచి వెనుతిరిగారు.

# చకచకా నమోదు..

- సర్వే సమాచారం ఆన్‌లైన్‌లో నిక్షిప్తం
- ఇప్పటివరకు 71 శాతం నమోదు
- సేవల్లో 1,753 మంది డేటా ఆపరేటర్లు
- సర్వే పత్రాలు భద్రపరిచేందుకు పెట్టెలు



సర్వే వివరాలను ఆన్‌లైన్ చేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు

**చుంచుపల్లి:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే జిల్లాలో విజయవంతంగా ముగియటంతో ప్రస్తుతం అధికార యంత్రాంగం సర్వే సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేసే పనిలో నిమగ్నమయ్యారు. జిల్లాలో సమగ్ర కుటుంబ సర్వే వివరాల ఆన్‌లైన్ నమోదు చకచకా జరుగుతోంది. ప్రభుత్వం డిసెంబర్ మొదటి వారంలోపు ఈ ప్రక్రియను పూర్తి చేయాలన్న ఆదేశాలతో జిల్లా యంత్రాంగం ఆ దిశగా వేగం పెంచింది. సమగ్ర కుటుంబ సర్వే కోసం ఎన్యూమరేటర్లు మొదట ఈ నెల 6 నుంచి 8 వరకు మూడు రోజులపాటు ఇంటింటికీ స్టిక్కర్లు అంటించి తొలుత హౌస్ లిస్టును తయారు చేసుకున్నారు. ఆ తర్వాత 9 నుంచి అసలు కుటుంబ సభ్యులు వారీగా ఆర్థిక, సామాజిక స్థితిగతుల వివరాలను సేకరించారు. సర్వే సమయంలో కొన్ని కుటుంబాల్లో వివాహమైన వారు ప్రత్యేకంగా ఉండటంతో వారిని ప్రత్యేక కుటుంబంగా పరిగణిస్తూ వివరాలను నమోదు చేసుకున్నారు.

20 రోజుల పాటు 2,655 మంది సర్వే సిబ్బంది ఇంటింటికీ తిరిగి సమగ్ర సమాచారాన్ని సేకరించింది. కుటుంబ సర్వే గత నెల 26తో పూర్తి కాగా ఆ వెంటనే అధికారులు ఆన్‌లైన్ నమోదును ప్రారంభించారు. వారం రోజులుగా ఈ ప్రక్రియ వేగవంతంగా జరుగుతోంది. కలెక్టరేట్, మండల పరిషత్, మున్సిపల్ గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఆన్‌లైన్ నమోదును చేపడుతున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 71 శాతం సర్వే వివరాల ఆన్‌లైన్ నమోదును పూర్తి చేశారు. మిగతా సమగ్ర సమాచారాన్ని క్రోడీకరించడానికి వారం రోజులు సమయం పట్టే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు.

**సగానికిపైగా పూర్తి..**

జిల్లాలో సమగ్ర కుటుంబ సర్వే సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి ప్రత్యేకంగా కంప్యూటర్ ఆపరేటర్లను నియమించారు. ఎంపీడీఓ తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టరేట్ కార్యాలయాల్లో పని చేస్తున్న ఆపరేటర్లతో పాటు బయటి నుంచి మరి కొందరి సేవలను వినియోగించుకుంటున్నారు. కంప్యూటర్ పరిజ్ఞానం తెలిసిన ప్రైవేట్ వారికి సైతం ఇందులో ఆపరేటర్లుగా అవకాశం కల్పిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 1,753 మంది కంప్యూటర్ ఆపరేటర్లు సమగ్ర సర్వే డేటా ఎంట్రీలో భాగస్వాములు అవుతున్నారు. వీరికి ముందే మాస్టర్ ట్రైనర్లు ప్రత్యేకంగా శిక్షణ తరగతులు నిర్వహించి అవగాహన కల్పించారు. ఆపరేటర్ ఒక్కో కుటుంబ వివరాలు నమోదు చేసినందుకు గానూ రూ.7 చెల్లిస్తారు. వివరాల నమోదులో ఏమైనా సందేహాలు ఉంటే సర్వే నిర్వహించిన ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లను సంప్రదించి వెంటనే నివృత్తి చేసుకుంటున్నారు. ఆయా కుటుంబంలో ఇద్దరు, ముగ్గురు సభ్యులు ఉంటే ఆన్‌లైన్ నమోదుకు 15 నిమిషాలు నుంచి 20 నిమిషాల వరకు సమయం పడుతోంది. ఎక్కువ మంది ఉంటే అర్ధగంట వరకు సమయం పడుతోందని ఆపరేటర్లు అంటున్నారు. జిల్లాలోని మొత్తం 3,36,407 కుటుంబాలకు గానూ ఇప్పటివరకు వివరాల క్రోడీకరణ 71 శాతం అనగా, 2,36,132 కుటుంబాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. సమగ్ర కుటుంబ సర్వే వివరాలు నమోదు చేసిన తరువాత ఆ పత్రాల భద్రత కూడా ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇంటింటా సమగ్ర కుటుంబ సర్వే చేపట్టిన అధికారులు ఆన్‌లైన్ పూర్తి కాగానే ఎప్పటికప్పుడు వాటిని జాగ్రత్తగా భద్రపరుస్తున్నారు. అందుకోసం ప్రతి మండలానికి ప్రత్యేకంగా ట్రంక్ పెట్టెలను ముందే పంపిణీ చేశారు. ఇందుకోసం జిల్లాకు 220 ట్రంక్ పెట్టెలను తెప్పించారు. సర్వే పత్రాల కంప్యూటరీకరణ చేస్తున్న ఆపరేటర్లు డేటా ఎంట్రీ తరువాత సూపర్‌వైజర్లకు అప్పగించడంతో వాటిని ట్రంకు పెట్టెల్లో భద్ర పరుస్తున్నారు.

**రెండు రోజుల్లో ప్రక్రియ పూర్తి**

జిల్లాలో సమగ్ర సర్వే పూర్తయింది. ప్రస్తుతం కుటుంబ వివరాల క్రోడీకరణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. కంప్యూటర్ ఆపరేటర్లు రోజుకు ఒక్కొక్కరు 30 నుంచి 40 కుటుంబాల వివరాలను నమోదు చేస్తున్నారు. రెండు రోజుల్లో సర్వే సమాచారం నమోదు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

– డి.వేణుగోపాల్, అదనపు కలెక్టర్

# సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం

- రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- రూ.3.62 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవం



నల్లబండబోడు బీటీ రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పక్కన కలెక్టర్ జితేష్, పీఓ రాహుల్, ఎమ్మెల్యే రాందాస్

**జూలూరుపాడు:** సంక్షేమ, అభివృద్ధే ధ్యేయంగా ఇందిరమ్మ ప్రభుత్వ పాలన కొనసాగుతోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం జూలూరుపాడు మండలంలో వైరా ఎమ్మెల్యే మాళోత్ రాందాస్ నాయక్‌తో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవం చేశారు. రూ.కోటితో మాచినేనిపేటతండా–తవిసిగుట్టతండా గ్రామాల మధ్య నిర్మించే బీటీ రోడ్డు, జూలూరుపాడులో రూ.10 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. రూ.2.52 కోట్లతో అనంతారం–నల్లబండబోడు గ్రామాల మధ్య నిర్మించిన బీటీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ అనంతారం, నల్లబండబోడు గ్రామాల మధ్య 4 కిలోమీటర్ల మేర రూ.2.52 కోట్లతో బీటీ రోడ్డు నిర్మించినట్లు తెలిపారు. సంక్రాంతి తర్వాత రైతు భరోసా అందిస్తామన్నారు. గత పాలకులు వరి సాగు చేస్తే ఉరే అని మాట్లాడారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తోందని, సన్న రకం ధాన్యానికి రూ. 500 బోనస్ ఇస్తున్నామని తెలిపారు. ఈ నెల 5న ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియ ప్రారంభిస్తామని, 6న గ్రామాల్లో అధికారులు పర్యటించి, ఇళ్లు లేని అర్హులైన పేదలను గుర్తిస్తారని అన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో 18.57 లక్షలు ఇళ్లు నిర్మించిన ఘనత ఇందిరమ్మ ప్రభుత్వానిదేననే విషయం మరవరాదన్నారు. మాయమాటలు, కాకిగోల చేసే బీఆర్‌ఎస్ నాయకులకు కర్రు కాల్చి వాతపెట్టినా బుద్ధి రాలేదన్నారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో నిరుద్యోగులకు 10 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని, ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక 10 నెలల్లోనే 53 వేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు. వైరా ఎమ్మెల్యే మాళోత్ రాందాస్ నాయక్ మాట్లాడుతూ నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ జితేష్ వి.పాటిల్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్ మాట్లాడుతూ మండలంలో బీటీ రోడ్లు నిర్మించేందుకు రూ.22 కోట్లు మంజూరు చేశామన్నారు.

**ఆశ్రమ పాఠశాల సందర్శన**

పడమటనర్సాపురం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సందర్శించారు. కిచెన్ రూమ్, స్టాక్ రూమ్, భోజనశాలను పరిశీలించారు. భోజనం నాణ్యత, పరిశుభ్రతను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి మెనూ అమలు తీరు, కాస్మోటిక్ కిట్స్ పంపిణీపై ఆరా తీశారు. ఈ కార్యక్రమాల్లో ఆర్‌డీఓ మధు, తహసీల్దార్ స్వాతి బిందు, కాంగ్రెస్ నాయకులు లేళ్ల వెంకటరెడ్డి, బొర్రా రాజశేఖర్, మాళోత్ మంగీలాల్ నాయక్, అధికారులు శ్రీనివాసరావు, సత్యనారాయణ, తానాజీ, మధుకర్, తాళ్లూరి రవి, డాక్టర్ సుకృత, జి.లక్ష్మి, వెంకటేశ్వర్లు, కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

## 'కాంగ్రెస్ మోసాలకు పన్నెండు మాసాలు'



మాట్లాడుతున్న రేగా కాంతారావు

**మణుగూరురూరల్:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలకు పన్నెండు మాసాలు పూర్తయిందని, ప్రజలను మోసం చేసినందుకే విజయోత్సవ సంబురాలు చేసుకుంటున్నారని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు విమర్శించారు. పట్టణంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు కాలేదని, సంక్షేమ పథకాలు సైతం ప్రజలకు సరిగ్గా అందడం లేదన్నారు. గురుకులాల్లో 46 మంది విద్యార్థులు కలుషిత ఆహారం తిని మరణిస్తే.. చర్యలు చేపట్టపోగా బీఆర్‌ఎస్ నేతలపై ఆరోపణలు చేస్తు న్నారని దుయ్యబట్టారు. గత ప్రభుత్వం చేసిన అభివృద్ధిని తాము చేసినట్లు చెబుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పాలనను ప్రజలు గమనిస్తున్నారని, ఇప్పటికే ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని, మళ్లీ రైతులు, ప్రజలు బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని జోస్యం చెప్పారు. సమావేశంలో పోశం నర్సింహారావు, కుర్రి నాగేశ్వరరావు, కుంట లక్ష్మణ్, బొలిశెట్టి నవీన్, నూకారపు రమేశ్, ముత్యం బాబు, ముద్దంగుల కృష్ణ, ఏనిక ప్రసాద్, ప్రభుదాస్, రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## పాఠశాలను ప్రారంభించిన ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

**దుమ్ముగూడెం:** లక్ష్మీనగరం గ్రామంలోని సీఎస్‌ఐ పాఠశాల సక్రమంగా నడవక పిల్లలు ఇబ్బందులు పడుతుండగా గమనించిన యువకులు పాఠశాలకు రంగులు వేసి చక్కగా తీర్చిదిద్దింది. విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి అభివృద్ధి చేసేలా చొరవ చూపారు. కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ప్రత్యేక దృష్టి సారించడంతో స్కూల్ తిరిగి తెరుచుకుంది. దీంతో విద్యార్థులు 'థాంక్యూ కలెక్టర్ సార్' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. కాగా, మంగళవారం ఆ పాఠశాలను ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సరియం రాజమ్మ, తెల్లం సీతమ్మ, పర్ణశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ప్రభాకర్, గుడ్ల రామ్మోహన్‌రెడ్డి, లంకా శ్రీనివాసరావు, వీరమాచనేని వినీల్, అన్నెం సత్యనారాయణమూర్తి, పిలక వెంకటరమణారెడ్డి, కుంజా శ్రీనివాసరావు, మట్టా శివాజీ, యువకులు మస్తాన్, వీరేందర్, వెంకట్, ఈశ్వర్, హేమంత్, హేమంత్‌రెడ్డి, పవన్, దల్లి హరిబాబు పాల్గొన్నారు.

## పత్తి నిండటంతో కొనుగోళ్లు నిలిపివేత

**కారేపల్లి:** కారేపల్లిలోని శ్రీలక్ష్మిప్రియా కోటెక్స్ జిన్నింగ్ మిల్లులో నిర్వహిస్తున్న సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రంలో పత్తి పేరుకుపోయింది. దీంతో జిన్నింగ్ ఆలస్యమయ్యే అవకాశం ఉన్నందున కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు ఇల్లెందు మార్కెట్ చైర్మన్ రాంబాబు, కార్యదర్శి నరేశ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4 నుంచి 8వ తేదీ వరకు సెలవులు ప్రకటించగా, 9వ తేదీ సోమవారం నుంచి పత్తి కొనుగోళ్లు మొదలవుతాయనే విషయాన్ని రైతులు గమనించాలని కోరారు.

## మావోలు, పౌరసంఘాల నేతలకు వ్యతిరేకంగా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీ, దళిత సంఘాల నాయకులు

**దుమ్ముగూడెం:** ఏజెన్సీలో ఆదివాసీ, దళితులను కిరాతకంగా మావోయిస్టులు హతమారుస్తుంటే పట్టించుకోని పౌరహక్కుల సంఘం నేతలు.. మారణహోమానికి పాల్పడే మావోలు ఎదురుకాల్పుల్లో చనిపోతే మాత్రం హడావుడి చేయడం గర్హనీయమని ఆదివాసీ, దళిత యువజన సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం లక్ష్మీనగరంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఇటీవల మావోయిస్టులు ఇన్‌ఫార్మర్ల నెపంతో ఊకే రమేశ్, పల్లెపాటి రాధ, బాడ్స మాస, ఊకే అర్జున్, ఇల్లందుల ఏసును హత్య చేసినా తెలంగాణ పౌరహక్కుల సంఘం నేతలు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. పౌర హక్కులు మావోయిస్టులకే వర్తిస్తాయన్నట్లు ప్రవర్తించడం సరికాదన్నారు. ఎన్‌కౌంటర్లలో మావోలు చనిపోతే క్షణాల్లో స్పందించే పౌర హక్కుల సంఘం నేతలు అదే ఆదివాసీ, దళిత యువత హత్యలను ఎందుకు పట్టించుకోవడం లేదో చెప్పాలన్నారు. మావోయిస్టులు, పౌర హక్కుల సంఘం నేతలకు ఉన్న రహస్య సంబంధమేంటని నిలదీశారు. ర్యాలీలో తెలంగాణ పౌర హక్కుల సంఘానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడమే కాక దిష్టి బొమ్మ దహనం చేశారు.

## గిరిజనుల జీవన విధానం వైవిధ్యభరితం

మహారాష్ట్ర శాస్త్రవేత్తల బృందం



దుమ్ముగూడెం : టైలర్‌పేట గ్రామస్తులతో బృందం సభ్యులు

**భద్రాచలం/దుమ్ముగూడెం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఏజెన్సీ గ్రామాల్లో గిరిజనుల జీవన విధానం వైవిధ్యభరితంగానే కాక ఆసక్తిగా ఉందని మహారాష్ట్రకు చెందిన శాస్త్రవేత్తల బృందం వెల్లడించింది. గిరిజనుల జీవన విధానం, ఆచార సంప్రదాయాలు పరిశీలించేందుకు బృందం సభ్యులు జిల్లాలో పర్యటించారు. తొలుత సారపాకలోని ఐటీసీ పీఎస్‌పీడీలో వెదురు ప్లాంటేషన్‌ను ఆ తర్వాత భద్రాచలం ఐటీడీఏలోని ట్రైబల్ మ్యూజియంను శాస్త్రవేత్త డాక్టర్ శ్రీకాంత్ గుంగా, రాహుల్ కుమార్, టెక్నికల్ ఎగ్జిక్యూటివ్ సిద్ధి ఫడ్నేకర్, అమత బెల్స్ సందర్శించారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను ట్రైబల్ మ్యూజియం ఇన్‌చార్జ్ వీరస్వామి వారికి వివరించారు. అనంతరం దుమ్ముగూడెం మండలం చిన్న నల్లబెల్లి గ్రామ పంచాయతీ పరిధి టైలర్‌పేట గ్రామాన్ని సందర్శించి అక్కడి ఆదివాసీల జీవన విధానం, మట్టి ఇళ్లను పరిశీలించారు. గిరిజన మహిళలు వెదురు మొక్కల పెంపకం ద్వారా లాభాలు గడించేలా శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు. అనంతరం బృందం సభ్యుడు డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ.. కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ సూచనలతో గిరిజన ఆవాసాలను సందర్శించామని చెప్పారు. వ్యవసాయం, పండ్ల తోటల సాగుకు జిల్లా అనువుగా ఉందని, ఇక్కడ జీవన విధానం వైవిధ్యంగా ఉన్నట్లు తెలుసుకున్నామని వెల్లడించారు. ఏపీ ఎంహెచ్‌ఆర్సీ నాగేశ్వరరావు, ఆర్‌ఐ వెంకటేశ్వర్లు, ఏపీఎం హేమాంతిని, ఉద్యోగులు రంగారావు, గణేశ్, గజ్జెల నర్సింహారావు, కల్లూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పోక్సో కేసులో ఐదేళ్ల జైలు

**కొత్తగూడెంఅర్బన్:** పోక్సో కేసులో ఓ వ్యక్తికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయమూర్తి (ఎఫ్‌ఏసీ పోక్సో స్పెషల్ కోర్టు) పాటిల్ వసంత్ మంగళవారం తీర్పు చెప్పారు. 2022 అక్టోబర్ 27న అశ్వాపురం గ్రామానికి చెందిన 12 ఏళ్ల బాలిక ఇంటి సమీపంలో ఆడుకోవడానికి వెళ్తుండగా ఉమామహేశ్వరరావు అడ్డగించి అసభ్యంగా ప్రవర్తించాడు. అంతకు ముందు కూడా బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి అశ్వాపురం ఎస్‌ఐ ఇ.నాగుల్‌మీరాఖాన్ కేసు నమోదు చేసి, కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఎనిమిది మంది సాక్షులను విచారించిన న్యాయమూర్తి.. సుగ్గల ఉమామహేశ్వరరావు (నానీ)పై నేరం రుజువు కావడంతో ఐదేళ్ల జైలుశిక్షతోపాటు రూ.10 వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. పోక్సో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెలగల నాగిరెడ్డి వాదించగా.. లైజన్ ఆఫీసర్ షేక్ అబ్దుల్ ఘనీ, కోర్టు డ్యూటీ ఆఫీసర్ ఈశ్వర్ సహకరించారు.

## హెచ్‌ఎం మృతికి సంతాపం



సీతారామయ్య (ఫైల్)

**చర్ల:** మండలంలోని దండుపేటకాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న శ్యామల సీతారామయ్య సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. మండలంలోని పెదమిడిసిలేరు గ్రామానికి చెందిన సీతారామయ్య ప్రస్తుతం దండుపేటకాలనీలోని పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తూ కుటుంబంతో సహా చర్లలోనే నివాసముంటున్నారు. పేద విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, స్కూలు బ్యాగులు, ఇతర స్టేషనరీ సొంత ఖర్చులతో కొనిచ్చేవారని పలువురు చెబుతున్నారు. మృతదేహాన్ని ఎంఈఓ పీవీ రమణతోపాటు పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు సందర్శించి నివాళులర్పించారు.

## పోక్సో కేసులో నిందితుడి అరెస్టు

**అశ్వారావుపేటరూరల్:** చిన్నారిపై లైంగికదాడికి పాల్పడిన వ్యక్తిని స్థానిక పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఎస్‌ఐ యయాతిరాజు కథనం ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన నాలుగేళ్ల చిన్నారికి తేజావత్ చిన్నా శీతల పానీయం ఇప్పించి లైంగికదాడికి పాల్పడిన ఘటన తెలిసిందే. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ తెలిపారు.

## కబేళాకు తరలిస్తున్న పశువుల పట్టివేత

**అశ్వారావుపేటరూరల్:** పశువులను కబేళాకు తరలిస్తున్న వ్యాన్‌ను బ్లూకోల్ట్స్ సిబ్బంది మంగళవారం పట్టుకున్నారు. ఎస్‌ఐ యయాతిరాజు కథనం ప్రకారం .. ఏపీలోని తుని నుంచి హైదరాబాద్‌లోని కబేళాకు వ్యాన్‌లో 10 ఆవులను తరలిస్తుండగా అశ్వారావుపేట సరిహద్దు చెక్‌పోస్టు వద్ద బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ రామారావు గుర్తించి పట్టుకున్నారు. పట్టుబడిన వ్యాన్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి సీజ్ చేయగా, తుని మండలానికి చెందిన జోగా శివాజీ, ఏసుబాబుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఆవులను పాల్వంచ గోశాలకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

## విద్యార్థుల సెల్‌ఫోన్లు చోరీ

**పాల్వంచరూరల్:** డిగ్రీ సెకండ్ సెమిస్టర్ పరీక్షలు రాసేందుకు వచ్చిన విద్యార్థుల సెల్‌ఫోన్లు చోరీకి గురైన ఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని లక్ష్మీదేవిపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు నెహ్రూనగర్‌లోని కేఎల్‌ఆర్ డిగ్రీ కళాశాలలో పరీక్షలు రాస్తున్నారు. సెల్‌ఫోన్లను ద్విచక్రవాహనాల సీట్ల కింద పెట్టి వెళ్లారు. దుండగులు సీట్లను కోసి, ఎనిమిది సెల్‌ఫోన్లను చోరీ చేశారు. పరీక్ష రాసి వచ్చిన విద్యార్థులు సెల్‌ఫోన్లు పోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఎస్‌ఐ రాఘవయ్యను వివరణ కోరగా సెల్‌ఫోన్ల చోరీపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

## అల్లుడిపై మామ దాడి

**పాల్వంచరూరల్:** తన కుమారుడిని చూసేందుకు వెళ్లిన వ్యక్తిపై మామ దాడి చేసిన ఘటనలో పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని నాగారంకాలనీకి చెందిన ఆటోడ్రైవర్ ధరావత్ విజయ్ గతేడాది పక్కింటి సారక్కను ప్రేమ వివాహం చేసుకున్నాడు. వారికి ఇటీవల బాబు పుట్టాడు. కొడుకును చూడటానికి విజయ్ వెళ్లగా.. మామతో వాగ్వాదం జరిగింది. కోపోద్రిక్తుడైన మామ భూక్యా వీరు కర్రతో దాడి చేశాడు. విజయ్ ఫిర్యాదు మేరకు మామపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేశ్ తెలిపారు.

## ముష్టిగింజలు స్వాధీనం

**కరకగూడెం:** అక్రమంగా ముష్టిగింజలు ఎవరైనా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని కరకగూడెం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ విజయ్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని రాళ్లవాగు వద్ద అన్నపురెడ్డిపల్లి మండలానికి చెందిన ముగ్గురు వ్యక్తులు రెండు ద్విచక్ర వాహనాలపై ఛత్తీస్‌గఢ్‌కు తరలిస్తున్న రూ.25వేలు విలువ చేసే 2.50 క్వింటాళ్ల ముష్టిగింజలను స్వాధీనం చేసుకొని ఏడూళ్ల బయ్యారంలోని రేంజ్ కార్యాలయానికి తరలించారు. సదరు వ్యక్తులపై కేసు నమోదు చేశామని విజయ్ తెలిపారు.